## ఇల్లేరమ్మ కతలు



# పిల్లేటి సొగసులు

**సా**యంకాలం స్కూలు నుంచి నేనూ చిన్నారీ ఇంటికి వచ్చేటప్పటికే చాలా ఆలస్యమయి పోయింది. ఈ వారం మా స్కూల్లో క్లాసు తుడిచే డ్యూటీ మా స్క్వాడుది. ఈవేళ నాకూ కుసుమకీ పడిందా డ్యూటీ. క్లాసు రూమంతా తుడిచి కాయితాలన్నీ ఏరి పెద్ద కాయితంలో చుట్టి స్కూలు మూలగా వున్న కుండీలో వేసేటప్పటికి ఇంతటయిమయింది. మేం పిల్లలందరం డ్యూటీలు చేసేసి ఇళ్లకెళ్లి పోయాక పెద్ద సిస్టర్లొచ్చి అన్ని క్లాసులూ చూస్తారు. ఎక్కడ ఒక్క కాయితం కనబడ్డా పొద్దున్నే నోటీసు బోర్డులో పెట్టేస్తారు. ''వి.సుశీల, పి. కుసుమ రోజీ స్క్వాడ్ ఫోర్త్ క్లాస్ 'బి' సెక్షన్'' అని. ఇంక ఎంతమంది నన్నడుగుతారో చెప్పలేను 'నీది రోజీస్క్వాడా' అని. ఆ అవమానం భరించడం కష్టం. అందుకే మళ్లీ మళ్లీ చూస్తూ తుడిచేటప్పటికి ఇంత సేపయింది. చిన్నారికేం లేవుగా ఈ బాధలు. మా స్కూల్లో మూడో క్లాసు వరకు డ్యూటీలుండవు. నాలుగో క్లాసు నించే ఈ బాధలన్నీను.

ఇంటికొచ్చేటప్పటికి అమ్మ చెరో ప్లేట్లో రెండేసి దోశెలు పెట్టి పంచదార వేసి పైన మూతలు పెట్టి వుంచింది. ఇంత కష్టం చేసి వచ్చాక రెండు దోశెలేం సరిపోతాయంటే అమ్మ వినిపించుకోదు. ఆవిడెవరో ఏ పనీ లేనట్లు అస్తమానం ఆంధ్రప్రభలో చెప్తుందిట - పిల్లలు పిల్లల్లాగా టిఫిన్లు టిఫిన్లలాగా తినాలని. అందుకే అమ్మ సాయంత్రం టిఫిను పెట్టీ పెట్టనట్లుగా పెడుతుంది. అలా తింటేనే తను కేకేయగానే రాత్రి అన్నాలకి పరిగెత్తుకుంటూ వస్తారట. బుజ్జికూడా నాతోనే పెట్టుంటే ఎలాగోలా దాన్ని ఇంకో సగం దోశయినా సంపాయించుండే దాన్ని గానీ ఈవేళ నాకు స్కూల్లోనే ఆలీసమయి పోడంతో వాళ్లిద్దరూ ఈ పాటికే తినేసి ఆడుకోడంలో పడ్డారు. ఈ 'అందరూ ఒకటే అందరికీ ఒకటే' రూలుతో నాకెంత అన్యాయం జరుగుతోందో ఎవ్వరికీ తెలిసి రావట్లేదు. ఈసారి అమ్మ నాకేదయినా పని చెప్పినపుడు చెప్తానావిడ గారికి. 'అందరం ఒకటే కదమ్మా, పోనీ బుజ్జి చేత చేయించుకో ఈ వేళ్టికి' అని.

గబగబా హోంవర్కు పూర్తి చేసేసుకుంటే ప్రమోదక్క వాళ్లింట్లో తొక్కుడు బిళ్లాడుకోవచ్చు కదాని పుస్తకాలు తీయబోతుంటే నాన్న రోజూ కంటే తొందరగా ఇంటికొచ్చేశారు. స్కూల్లో డ్యూటీలు చాలవన్నట్లు మా అమ్మేమో ఇంట్లో కూడా నాకే డ్యూటీ! అదేవిటంటే ఇంటికి ఎవరొచ్చినా నేను గానీ బతికుంటే మంచినీళ్లు నేనే తెచ్చివ్వాలి. నే లేకపోతే చిన్నారి. అదీ లేకపోతే ఇందు. తనకున్న పని తనకున్నా తప్పదురా అని అమ్మ రోజూ అంటుందిగా. మరిప్పుడే రెండు దోశెలు తిన్నాక అసలు తప్పదుగా! చచ్చినట్లు లేచి పెద్ద గ్లాసుతో మంచినీళ్లు తెచ్చాను.

మంచినీళ్లు తాగి నాన్నడిగారు ''అమ్మేదే నానీ! పిలు!''

''అమ్మా, చిన్నారీ పెరట్లో ఆనప్పాదు నీళ్ల గదిమీదకెక్కిస్తున్నారు నాన్నా!'' అని, అమ్మా నాన్న పిలుస్తున్నారే అని అక్కడ్నించి కదలకుండానే కేక పెట్టాను ఎక్కడున్నా వినిపించేలా!

'ఆహా! మీరు రోజూ ఇలా పెందరాళే కొంప చేరితే జడివానలు కురిసి గుంటూరు బావుల్లో ఇంకో అడుగుపైకి నీళ్లన్నా వూర్తాయేమో' అంటు ఒక పెద్దగ్లాసు కాఫీ ఇచ్చి మళ్లీ వెళ్లి సరంజామాతో సహా వచ్చి కూచుంది.

సరంజామా అంటే కత్తిపీట, దొండకాయలు రెండు పళ్లేలూ నన్నమాట. అమ్మ ముచికలు కూడా నేలమీద తరగదు. వాటికో ప్లేటు పెడుతుంది.

''ఏవిటి విశేషం! వస్తూనే నా గురించడుగుతున్నారు. మీ నానీగారితో కబుర్లు చెప్పుకోకుండా?''

నాన్నన్నారు. ''నే ఎప్పుడు పిలిచినా కత్తిపీటతో సహా వస్తావేమిటే హడలిపోయేలాగా! వూరికే రావచ్చుగా పిలిచినప్పుడు!''

''ఏమో! ఎవరి జాగ్రత్త వాళ్లది. ఈ వెధవ దొండకాయలు గంటసేపు తరగాలి. రెండు గంటలసేపు వేయించాలి. అయినా మీతో చేతులు కబుర్లు చెప్పవుగా!'' అమ్మ చకచకా తరుగుతూనే వుంది.

''అవునూ! ఈవేళ ఆఫీసులో స్వామినాథన్ గారడిగారు మీ ఆవిడ జ్వరమెలా వుందయ్యా అని. నీకు జ్వరం వచ్చిందని వెళ్లి వెళ్లి ఆయనతో చెప్పకపోతే నాకు చెప్పచ్చుగా ముందస్తుగా. ఏం చెప్పాలో తోచక అటు ఇటు చూస్తుంటే 'అమ్మాయి ఆరోగ్యం పట్టించుకోకపోతే ఎలా గయ్యా! సిసింద్రీ

లాంటి నలుగురు పిల్లల్తో ఒక్కత్తి ఎలా వేగుతుందీ!' అని నన్నే గదమాయించారు. ''అవున్లెండి. నాకు వేరే పనేం లేదు. వెళ్లి వెళ్లి మీ స్వామినాథన్ గారికి చెప్పు కోడం తప్ప. నాకు జరం వచ్చిందని నిన్న వాళ్లింట్లో పేరంటానికి నాకు వెళ్లాలనిపించక ఈ పెద్ద దయ్యాన్నీ బుజ్జినీ పంపాను. అక్కడ ఇది ఏం వాగిందో మరి!''

నాకయితే వళ్లు మండిపోయింది. ''నువ్వే కదమ్మా! మీ అమ్మ రాలేదేం అంటే ఒంట్లో బాగుండలేదని చెప్పమన్నదీ! తీరా వంట్లో బాగా లేదని చెప్తే ఏం బాలేదు ఎందుకు బాలేదు అని అడుగుతారని జరం వచ్చిందని చెప్పా! అది కూడా తప్పయిపోయిందా తల్లీ!''

నేనా వూరికే మాటలు పడేదాన్ని! అందులో నాన్నక్కడ వుండగా.

''మొన్న పాపం ఆయన నాతో స్వయంగా చెప్పారు కదా. మా అమ్మాయి పెద్ద మనిషయిం దోయి. శుక్రవారం సాయంత్రం మీ ఆవిడనీ పిల్లలనీ పేరంటానికి వెళ్లమని చెప్పూ' అని. నీకా సంగతి చెప్పానా లేదా? ఒక్కసారి తొంగి చూసొస్తే నీ సొమ్మేం పోయింది?'' అప్పుడపుడు నాన్న క్కూడా కోపం వస్తుందన్న మాట.

''నన్ను పంపించమని మీకు ఆయన ఆర్డరేశారు. నన్నేమో వాళ్ల వంటావిడ వచ్చి పిలిచి వెళ్లింది. ఇలాటి పిచ్చి పిచ్చి పేరంటాలు ఆవిడ చేస్తే చేయచ్చుగాక. మీతో చెప్పడానికి ఆయనకెంత సిగ్గు లేదో! వంటావిడ పిలుపులకి పిల్లలెడితే చాలదేవిటి? అయినా మరేం కొంపలేం మునగలేదు లెండి. అయిదు రూపాయిలెట్టి వెండి గ్లాసు కొని, డబ్బాడు కాజాలు చేసి బుజ్జీని, నానీని పంపించాను. దీనికి బాబాయిగారు ఇల్లేరమ్మని పేరు వూరికే పెట్టారా! తొమ్మిది దాకా అక్కడే డేకి అందరి కాళ్లకీ పసుపులవీ రాసి అప్పుడు కొంపచేరింది బుట్టెడు శనగలూ లడ్డులూ చిమ్మిలి చక్కలాలూ అన్నీ మోసుకుని. మీకు తగ్గ కూతురే! ఎక్కడ సందడి కనపడితే అక్కడే ఆగిపోతుంది. తెలియని వాళ్లెవరయినా చూసి ఏ పనివాళ్ల పిల్లో అను కుంటారు.!''

అమ్మతో అసలు నాకిక్కడే గొడవ వస్తుంది. ఎక్కడ పేరంటమన్నా వెళ్లదు. నాన్నతో సినిమా కయితే మాత్రం రెడీ! పేరంటం ఎలా మానేయాలా అని తను ఆలోచిస్తుంటే నేనే వుపాయం చెప్పాను! నేనూ బుజ్జీ వెళ్ళొస్తాంలే అమ్మా. మామీ అడిగితే నీకు జరం వచ్చిందని చెప్తాను! అని. ఇంత కూడా విశ్వాసం లేకుండా మళ్లీ నన్నే అంటోంది. అసలు మామీకి సాయం చెయ్యమని చెప్పింది కూడా ఈవిడ గారే!

భయపడ్డట్టుగానే, నేను పేరంటానికి వెడుతూనే అడిగింది మామీ. 'అమ్మ రాలేదా నానీ' అని. అప్పటికే ఆలోచించి పెట్టుకున్నా కాబట్టి తడువుకోకుండా చెప్పేశాను.

''లేదు మామీ! అమ్మకి నువ్వు గింజలు వేగే జరం. అస్సలు లేవలేకపోయింది. వంట కూడా నేనే చేసి వచ్చా''నని చెప్పా.

''అబ్బో వేలెడు లేవు. వంట కూడా చేసావుటే. ఏం వండావేమిటి?'' ప్రమోదక్కా వాళ్ల అమ్మగారడిగారు.

తేలిగ్గా అయిపోతుందని కంది పచ్చడి చేసి



ఉల్లిపాయల పులుసు చేసానని చెప్పా! పది మందిలో తక్కువగా చెప్పకూడదు కదా.

ఇందులో నవ్వేందుకేముందనో మరి వాళ్లిద్దరూ నవ్వుకున్నారు. నానీ నువ్వు అందరికీ పసుపూ బొట్టూ కనుక్కోమ్మా అని మిగతా వాళ్ల తో కబుర్లలో పడిపోయింది. ''నేను వంట చేసానని చెప్పబట్టే కదా నాకంత ముఖ్యమయిన పని అప్ప చెప్పింది! ఏవీ చెప్పకుండా చిన్నారిలా ముంగిలా వుంటే ఎలా తెలుస్తుందీ ఎవరికయినా! పాపం మైథిలక్క పూల్జడ వేసుకుని కుర్చీలో కూచుంది. హారతిచ్చే వరకు లేవకూడదు కదా. నేనే పరిస్థితులలో అంతసేపుండి పోయానో తెల్సు కోకుండా ఇంటికి రాగానే ఈవిడగారికే కలొకటి. ఏ పనీ చెయ్యకుండా ఏవీ వినిపించుకోకుండా నెత్తి మీద నీళ్ల కుండెట్టుకు తిరిగే చిన్నారమ్మ గారి పనులు అందరికీ బాగానే వుంటాయి. అందరి పనులు నొల్లుకు చేసే నాకే అన్ని తిట్లూను!''

ఇంతలోకీ మళ్లీ నాన్నకి గుర్తు వచ్చినట్లుంది. ''అవునూ! ఇంతకీ నువ్వెందుకు వెళ్లలేదు?''

''మళ్లీ మొదలెట్టారూ! ఎందుకో వెళ్లలేదు! మీకు తెలుసుగా నేను పేరంటాలకెళ్లనని! ఎంత చెప్పినా మీకెలాగూ అర్థం కాదు!'' అమ్మ విసుక్కుంది.

అమ్మ చెప్పలేకపోతోందని నా కర్థమయిపోయింది. ''ఎలా వెడుతుంది నాన్నా అమ్మ పాపం గ్లాస్గో చీర కట్టుకుని సన్న శాలు వేసుకుని! అక్కడ మామీలంతా సినిమాలో మల్లీశ్వరీ వాళ్ల అమ్మల్లాగా ఎన్ని వస్తువులు పెట్టుకొచ్చారో! వాళ్ల మధ్యలో కూచోవాలంటే అమ్మకెలా వుంటుందీ!''

''నువ్వు నోరు మూసుకోవే ఆరిందా గోవిందమ్మా! పదిమంది పెట్టు నువ్వెళ్లి వచ్చావుగా! ఏదో వంట్లో బాలేదని చెప్పవే అంటే వున్నవీ లేనివీ వాగొచ్చి నా ప్రాణం మీదకి తెచ్చావు!'' అమ్మ మళ్లీ నన్నే కోప్పడింది.

అప్పుడర్థమయింది మా మహానుభావుడు నాన్నకి అమ్మ పేరంటాలకెందుకెళ్లదో.

''వాళ్లయితే మల్లీశ్వరీ అమ్మల్లా వుంటారు కాబట్టి నగలు కావాలి గానీ నీకెందుకోయి నగలు! అంతగా అయితే మా అమ్మ వడ్డాణం పెట్టు కెళ్ళచ్చుగా! మించిపోయిందేవుంది. ఈ వేళయినా ఆ వడ్డాణం పెట్టుకుని ఒక్కసారి వెళ్లిరా పాపం బాగుండదు వెళ్లకపోతే!'' నాన్న నచ్చచెప్ప బోయారు.

''అసలు మాట్లాడకండి! మీరిద్దరూ ఇలాగే అక్కర్లేని విషయాల్లో కలగచేసుకుని నాకు చిరాకు తెప్పిస్తారు. నేనేవన్నా ఈ పీనుగు దగ్గర అన్నానా నగల్లేవని పేరంటాలకెళ్లనని! మీరేమో మీ అమ్మగారి గుర్తని చెప్పి ఆ వడ్డాణం చెరిపించి ఏవీ చేయించుకోనీరు. అవసరాలకి బాంకులో పెట్టుకునేందుకు తప్ప ఇంకెందుకూ పనికిరాదు. నా నడుపు కెప్పుడో పట్టడం మానేసింది. చేతులకి ఓ ''నాలుగు జతల గాజులూ లేక, మెడలో ఓ చంద్రహారమన్నా లేక వడ్డాణం తగిలించుకెడితే నలుగురూ వెనకాలన్నా నవ్వుకోరూ! చెవులకీ లేవు ముక్కుకీ లేవు. పీతురు కాళ్లకి పిల్లేళ్లని! మరీ కాదనుకుంటే మీరే ఓసారి వెళ్లిరండి వాళ్లింటికి. మగాళ్లకయితే పెట్టుకున్న వస్తువులని బట్టి అంతస్థులు అంచనాలెయ్యరు కదా!''

**–సోమరాజు సుశీల**